ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 210 | పేజీలు: 5 | వెల: రూ.3/- | శుక్రవారం 6 నవంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

ఫ్యూచర్ సిటీలో
గ్లోబల్ సమ్మిట్‌కు పక్కా ఏర్పాట్లు!

ప్రతి ప్రతినిధికి ప్రత్యేక లైజనింగ్ అధికారి..

భద్రతకు అత్యంత ప్రాధాన్యత

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026

నవంబర్ 15లోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం ఆదేశం



హైదరాబాద్, నవంబర్ 5 (ప్రభాత ఉదయం)

తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ప్రత్యేకంగా ఒక లైజనింగ్ అధికారిని నియమించాలని సీఎం సూచించారు.

తెలంగాణ పర్యాటక రంగానికి ప్రాధాన్యత

విమానాశ్రయానికి ప్రతినిధులు చేరుకున్న వెంటనే రిజిస్ట్రేషన్, పాస్‌ల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని సమావేశానికి ముందుగానే వారికి అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించాలని స్పష్టం చేశారు. ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారితో పాటు భద్రతా అధికారిని నియమించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమ్మిట్ నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

ముఖ్యమంత్రులను ఆహ్వానించాలి

తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలను అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేసేలా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. పర్యాటక రంగానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేలా సమ్మిట్‌లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని పేర్కొన్నారు. వాతావరణ మార్పులపై గ్లోబల్ సమ్మిట్‌లో ప్రత్యేక చర్చ జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

తెలంగాణ విద్యా రంగ ప్రగతిని నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ స్థాయి వరకు ప్రతిబింబించేలా విద్యా వ్యవస్థపై సమ్మిట్‌లో చర్చలు ఉండాలని ఆకాంక్షించారు. గ్లోబల్ సమ్మిట్‌కు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించాలని సీఎం సూచించారు. నవంబర్ 15వ తేదీలోగా సమ్మిట్‌కు సంబంధించిన సమగ్ర ఏర్పాట్ల ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు గడువు విధించారు. తెలంగాణ ప్రతిష్టను ప్రపంచ వేదికపై మరింత ..మిగతా 2లో



బీసీ సంఘాలకు రేవంత్ సర్కార్
గుడ్ న్యూస్

ఆత్మగౌరవ భవనాలకు భారీగా నిధులు

హైదరాబాద్‌లో 38 బీసీ కుల సంఘాల భవనాలకు నిధులు

ఆత్మగౌరవ భవనాల నిర్మాణం కోసం రూ. 88.50 కోట్లు మంజూరు

హైదరాబాద్, నవంబర్ 5 (ప్రభాత ఉదయం)

వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో 38 బీసీ కుల సంఘాల కోసం 'ఆత్మగౌరవ భవనాల' నిర్మాణానికి రూ. 88.50 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) పత్రాలను అందజేశారు. అన్ని కులాల సామాజిక, సాంస్కృతిక, విద్యాభివృద్ధి లక్ష్యంగా ఈ భవనాల నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు.

తెలంగాణ క్యాబినెట్ నిర్ణయాలు



హైదరాబాద్, నవంబర్ 5 (ప్రభాత ఉదయం)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో ఇప్పటివరకు ఉమ్మడిగా ఉన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్లను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆయా వర్గాలకు సంబంధించిన సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించడంతో పాటు, ప్రత్యేకంగా సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

1. దీపావళి సందర్భంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 2,25,000 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయింది. నిర్మాణం పూర్తయిన అన్ని ఇళ్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

2. నవంబర్ 7 నుంచి 9 వరకు కొడంగల్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారు. నవంబర్ 9న కొడంగల్‌లో భారీ రైతు బహిరంగ సభ నిర్వహిస్తారు. ఈ సభలో ముఖ్యమంత్రి, మంత్రులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొంటారు.

3. నవంబర్ 19న మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని సిద్దిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తాం. అదే రోజు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభిస్తాం. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తాం.



ప్రయాణికులకు గుడ్ న్యూస్

సగానికి పైగా తగ్గనున్న మెట్రో-ఆర్టీసీ కామన్ పాస్ ధరలు!

హైదరాబాద్ మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్ ధరలను తగ్గించనున్న తెలంగాణ ప్రభుత్వం

ప్రస్తుత ధరలు అధికంగా ఉన్నాయన్న ఫీడ్‌బ్యాక్‌తో ఈ నిర్ణయం

రోజువారీ పాస్‌ను రూ.400 నుంచి రూ.325కి తగ్గించే అవకాశం

నెలవారీ పాస్‌ను రూ.8,500 నుంచి రూ.4,000-4,500 మధ్యకు తగ్గింపు

దీపావళి నుంచి సవరించిన కొత్త ధరలు అమల్లోకి వస్తాయని అంచనా

హైదరాబాద్, నవంబర్ 5 (ప్రభాత ఉదయం)

హైదరాబాద్ నగర ప్రయాణికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఇటీవల ప్రవేశపెట్టిన కామన్ పాస్ ధరలను భారీగా తగ్గించాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు చాలా అధికంగా ఉన్నాయని ప్రయాణికుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టింది. సవరించిన ధరలు దీపావళి నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ కామన్ పాస్ ధరలు ప్రయాణికులకు భారంగా మారాయి. రోజువారీ పాస్ కోసం రూ.400, నెలవారీ పాస్ కోసం ఏకంగా రూ.8,500 చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఈ పాస్‌పై ప్రజల నుంచి ఆశించిన స్పందన రాలేదు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు, ధరలను సవరించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తాజా నివేదికల ప్రకారం రోజువారీ పాస్ ధరను రూ.400 నుంచి రూ.325కు తగ్గించనున్నారు. అదేవిధంగా, నెలవారీ పాస్ ధరను రూ.8,500 నుంచి సుమారు రూ.4,000 – రూ.4,500 మధ్యకు తీసుకురావాలని భావిస్తున్నారు.

'ఆర్ఆర్ ట్యాక్స్'
నిజమే అయితే చర్యలేవి?

మోదీ, షాలకు కేటీఆర్ ప్రశ్న

ఆర్ఆర్ ట్యాక్స్‌పై కేటీఆర్ మరోసారి విమర్శలు

చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణ

బిల్డర్లు, డెవలపర్లకు విషయం తెలుసన్న కేటీఆర్

విమర్శలు చేస్తున్న కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్న

బీజేపీ-కాంగ్రెస్ మధ్య అవగాహన ఉందని ఆరోపణ

హైదరాబాద్, నవంబర్ 5 (ప్రభాత ఉదయం)



తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేతలు ఆరోపణలు చేస్తున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు.

తన ఎక్స్ పోస్టులో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు ..మిగతా 2లో

చర్చకు సిద్ధం

రాహుల్‌కు అమిత్ షా సవాల్..

ప్రధానికి అధికారికంగా లేఖ రాయాలని సూచన

ఎస్ఐఆర్, ఈవీఎంలు, చొరబాటుదారులపై చర్చకు రెడీ..

ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకూ సై



హైదరాబాద్, నవంబర్ 5 (ప్రభాత ఉదయం)

ఎస్ఐఆర్, ఈవీఎంల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ చర్చకు రావాలంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. రాహుల్‌కు నిజంగానే చర్చించాలనే చిత్తశుద్ధి, ధైర్యం ఉంటే ప్రధానమంత్రికి అధికారికంగా లేఖ రాయాలని సూచించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలు, చొరబాటుదారుల అంశాలపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

రాహుల్‌పై అమిత్ షా విమర్శలు

హరియాణాలోని కర్నాల్‌లో బీజేపీ నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో, అరాజకత హఠావో' యాత్రలో అమిత్ షా ప్రసంగించారు. పార్లమెంట్‌ను సజావుగా నడవనివ్వకుండా బయట రాజ్యాంగ పుస్తకాన్ని ..మిగతా 2లో

కాంగ్రెస్‌లో సద్దుమణగని విభేదాలు!

దామోదర వర్సెస్ లక్ష్మీకాంతారావు వివాదానికి తెరదించలేకపోయిన పీసీసీ చీఫ్.. గాంధీభవన్ సమావేశానికి మంత్రి డుమ్మా.. ఎమ్మెల్యేతో భేటీ

కాకుండానే వెనుదిరిగిన మహేశ్ గౌడ్

హైదరాబాద్, నవంబర్ 5 (ప్రభాత ఉదయం)



సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడి నియామకంపై స్థానిక మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మధ్య వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. వారి మధ్య వివాదాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నించిన పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ప్రయత్నం విఫలమైంది. ఈ విషయమై చర్చించేందుకు ఇద్దరు నేతలను గాంధీ భవన్‌కు రావాల్సిందిగా ఆదేశించారు. ఉదయం మంత్రితో, మధ్యాహ్నం ఎమ్మెల్యేతో మాట్లాడాలని నిర్ణయించారు. అసలు ఏం జరిగింది.. పరిష్కార మార్గం ఏంటి అనే దానిపై ఇద్దరితో విడివిడిగా మాట్లాడాలని ..మిగతా 3లో

పాగుంట వెంకన్న జాతరకు వేళాయే!

పది రోజుల పాటు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు

నవంబర్ 7 నుంచి ఉత్సవాలు ప్రారంభం

10న స్వామివారి రథోత్సవం

తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక నుంచి తరలిరానున్న భక్తులు




జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 5(ప్రభాత ఉదయం):

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు పాగుంట శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు వేళైంది. కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో కొలువుదీరిన స్వామివారి జాతరకు ఆలయ ప్రాంగణం ముస్తాబైంది. నవంబర్ 7 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు పది రోజుల పాటు వైభవంగా కొనసాగనున్నాయి. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోనున్నారు.

కల్యాణోత్సవం.. రథోత్సవం ప్రత్యేక ఆకర్షణ

శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నవంబర్ 7న శనివారం అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నవంబర్ 8న ఆదివారం సుప్రభాత సేవ, ధ్వజారోహణం, విష్ణు సహస్రనామ పారాయణం జరగనున్నాయి. నవంబర్ 9న సోమవారం ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, సాయంత్రం 6 గంటలకు ప్రభోత్సవం నిర్వహిస్తారు. నవంబర్ 10న మంగళవారం సాయంత్రం 7 గంటలకు శ్రీస్వామివారి రథోత్సవం భక్తిశ్రద్ధలతో జరగనుంది. నవంబర్ 11న బుధవారం సుప్రభాత సేవ, నిత్యహోమం, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, పల్లకీ సేవతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పురేందర్ తెలిపారు.





జాతర మైదానంలో సందడే సందడి

జాతరను పురస్కరించుకుని ఆలయ పరిసరాల్లో ఇప్పటికే వివిధ రకాల దుకాణాలు వెలిశాయి. పిల్లల కోసం జాయింట్ వీల్, బ్రేక్‌డ్యాన్స్ తదితర వినోద కార్యక్రమాలతో ఆటల ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు దాసంగాలు సమర్పించేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నారు. అమావాస్య సందర్భంగా నిర్వహించే స్వామివారి కల్యాణోత్సవానికి భారీగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది.

భక్తులకు అన్ని ఏర్పాట్లు

భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈఓ పురేందర్ ఆధ్వర్యంలో తాగునీరు, మౌలిక వసతులు, క్యూ లైన్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీతో పాటు రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాయి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గద్వాల డీఎస్పీ వై.మొగులయ్య సూచనల మేరకు గద్వాల సీఐ టి.శ్రీను, కేటిదొడ్డి ఎస్ఐ పి.శ్రీనివాసులు పర్యవేక్షణలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

వివేకానంద నగర్‌లో శ్రీలక్ష్మి చిన్నారుల వైద్య, క్యాన్సర్ చికిత్స కేంద్రం ప్రారంభం

కాలనీవాసులకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలి:రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి

కూకట్ పల్లి, నవంబర్ 5 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం,

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ వీధి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మి చిన్నారుల వైద్య, క్యాన్సర్ చికిత్స కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఉదయం 10.30 గంటలకు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమ్యవర్ధని సమక్షంలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి, కార్యదర్శి రాంచందర్ రావు, కమిటీ సభ్యులు పాల్గొని వైద్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమ్యవర్ధినిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాలనీవాసులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైద్యులు కాలనీవాసులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ చిన్నారులకు, ఇతర రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు, తగిన చికిత్స అందించాలని కోరారు. ఈ వైద్య కేంద్రం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ మరింత మందికి వైద్య సేవలు అందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ వైద్యులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సహకరించిన కమిటీ సభ్యుడు పి. సూర్య నారాయణకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు జి. ప్రసాద్, టైగర్ పురుషోత్తం, లక్ష్మీనారాయణ, మూర్తి, వెంకటేశ్వరరావు, జి. నర్సింగరావు, కిషోర్, భాస్కర్, శ్రీనివాస్ తదితరులతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి. సూర్యనారాయణ కార్యక్రమానికి హాజరైన కాలనీవాసులకు, అసోసియేషన్ కమిటీ సభ్యులకు పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.



భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

- భూభారతి, జీవో 118, 59, యూఎల్‌సీ, 90-డి, 92 దరఖాస్తులపై ప్రత్యేక కార్యాచరణ

- నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 5 (ప్రభాత ఉదయం)

జిల్లాలో భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు కిరణ్మయి, చంద్రా రెడ్డితో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూభారతి, జీవో 118, 59, యూఎల్‌సీ, 90-డి, 92 దరఖాస్తుల పరిష్కార పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి పోర్టల్ లో పెండింగ్ లో ఉన్న సుమారు 22 వేల దరఖాస్తులను నవంబర్ 15లోగా పరిష్కరించాలని, జీవో 118 దరఖాస్తులను వారం రోజుల్లో, జీవో 59, 92 దరఖాస్తులను 15 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. యూఎల్‌సీకి సంబంధించి జీవో 455, 456, 740 కింద ఉన్న మాన్యువల్ దరఖాస్తులను రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా పరిష్కరించాలని సూచించారు. భూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, గ్రామసభలకు వారం రోజుల ముందుగానే నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. అటవీ, రోడ్లు భవనాలు, ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన భూముల వివరాలను సేకరించి, ఆయా శాఖల అధికారుల సమక్షంలో సరిహద్దులను నిర్ధారించాలని, వారి అభిప్రాయాలు, సంతకాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామసభల నిర్వహణలో నిర్దేశిత ఎస్ఓపీని తప్పనిసరిగా పాటించాలని, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి హాజరు కావాలని, సమావేశ మినిట్స్‌ను అధికారిక రిజిస్టర్లలో నమోదు చేసి హాజరైన వారి సంతకాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రీ-సర్వేకు సంబంధించిన 13 ఫార్మాట్లను సక్రమంగా నిర్వహిస్తూ, సర్వే బౌండరీస్ యాక్ట్--1923, తెలంగాణ భూభారతి చట్టం--2024 నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ, రిజర్వ్, ఇతర శాఖల భూముల విషయంలో క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని, నోటీసుల జారీ, సరిహద్దుల నిర్ధారణ, గ్రామసభ మినిట్స్ సహా అన్ని రికార్డులను భద్రపరచాలని కలెక్టర్ ఆదేశించారు. తప్పుడు నివేదికలు సమర్పించడం, రికార్డుల తారుమారు, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే సంబంధిత అధికారులపై కఠిన శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు డాక్టర్ , చంద్రారెడ్డి, ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ రాంరెడ్డి, డిఆర్ఓ శారదా దేవి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లు, యూఎల్‌సీ విభాగం అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, గ్రామపాలన అధికారులు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



భూ రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 5 (ప్రభాత ఉదయం)

భూ రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం అవుతుందని అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి అన్నారు. గురువారంభూ భారతి కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం మనోరాబాద్ గ్రామంలో గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి అధ్యక్షతన భూ రీసర్వే గ్రామసభ , అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... భూ రికార్డులను ఆధునికీకరించడం, భూముల కొలతల్లో ఖచ్చితత్వాన్ని పెంపొందించడం, భూ సరిహద్దు వివాదాలను పరిష్కరించడం, భూ యజమానుల హక్కులను స్పష్టంగా నిర్ధారించడం భూ రీసర్వే ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఆధునిక డిజిపిఎస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భూములను అత్యంత ఖచ్చితత్వంతో సర్వే చేసి, డిజిటల్ భూ రికార్డులను రూపొందించడం జరుగుతుందని వివరించారు. రీసర్వే ద్వారా భూముల సరిహద్దులను స్పష్టంగా గుర్తించడం వల్ల రైతుల మధ్య భూ వివాదాలు తగ్గుతాయని, భూముల విస్తీర్ణాన్ని కచ్చితంగా నిర్ధారించడంతో పాటు పాత భూ రికార్డులను డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావచ్చని పేర్కొన్నారు.అలాగే భూ యాజమాన్య హక్కుల స్పష్టత, ప్రభుత్వ , ప్రైవేటు భూముల ఆక్రమణల గుర్తింపు, భూముల సబ్‌డివిజన్ వివరాల నమోదు వంటి ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. ఖచ్చితమైన భూ రికార్డులు అందుబాటులో ఉండటం వల్ల రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంతో పాటు బ్యాంకు రుణాలు పొందేందుకు సైతం సౌలభ్యం కలుగుతుందని వివరించారు. రీసర్వే పూర్తయిన అనంతరం నిబంధనల ప్రకారం కొత్త భూ రికార్డులు, పట్టా వివరాలను డిజిటల్ విధానంలో పొందుపరచడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు మనోరాబాద్ గ్రామ భూ వివరాలను గ్రామసభలో వెల్లడించారు. గ్రామ మొత్తం భౌగోళిక విస్తీర్ణం 288 ఎకరాల 07 గుంటలు కాగా, మొత్తం 48 సర్వే నంబర్లు ఉన్నాయి. ఇందులో పట్టా భూమి 267 ఎకరాల 16 గుంటలు, ప్రభుత్వ భూమి 18 ఎకరాల 35 గుంటలుగా వివరించారు. ప్రభుత్వ భూముల్లో ఎండోమెంట్ భూమి 3 ఎకరాలు, ప్రభుత్వ భూమి 10 ఎకరాల 05 గుంటలు, లావణ్య పట్టా భూమి 5 ఎకరాల 30 గుంటలుగా గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా రీసర్వే చేయవలసిన సబ్‌డివిజన్ నంబర్లు 388 ఉన్నట్లు వెల్లడించారు.భూ రీసర్వే ప్రక్రియలో రైతులందరూ చురుకుగా భాగస్వాములై అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. రైతులు తమ భూములకు సంబంధించిన పాత రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్‌లు, ఇతర సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, సర్వే సమయంలో తమ భూముల సరిహద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించుకోవాలని కోరారు. పారదర్శకమైన, ఖచ్చితమైన డిజిటల్ భూ రికార్డుల వ్యవస్థ ఏర్పాటుకు భూ రీసర్వే ఎంతో దోహదపడుతుందని, దీనివల్ల భూ యజమానులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏ డి ఎస్ ఎల్ ఆర్ రామ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, మంచాల్ తహసీల్దార్ వి.ప్రసాద్ రావు, ఇబ్రహీంపట్నం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే డి.శ్రీనివాస్, మండల సర్వేయర్ ఎస్ వి ధనశ్రీ, మంచాల్ మండల లైసెన్స్ సర్వేయర్లు, గ్రామ పాలన అధికారి ఎన్. జంగయ్య, సర్పంచ్ ఏ సంజీవ రెడ్డి, మంచాల్ మండల సిబ్బంది , గ్రామ రైతులు పాల్గొన్నారు.





ఢిల్లీలో 'ఓట్ బచావో - దేశ్ బచావో' ర్యాలీని విజయవంతం చేసిన కూకట్‌పల్లి కాంగ్రెస్ నేతలు

సాధు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లి విజయవంతం

కూకట్‌పల్లి,నవంబర్ 2 (ప్రభాత ఉదయం)

న్యూఢిల్లీ రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న నిర్వహించిన 'ఓట్ బచావో - దేశ్ బచావో' నిరసన ర్యాలీలో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాధు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీకి భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుల సంరక్షణ లక్ష్యంగా నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ ర్యాలీలోఢిల్లీలో జరిగిన ఈ నిరసన ర్యాలీలో కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు ఐకమత్యంతో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటానికి తమ సంఘీభావాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పి. నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, కూకట్‌పల్లి మాజీ పార్టీ అధ్యక్షులు ఎస్. సతీష్ రెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజీవరావు, కంటెస్టెడ్ కార్పొరేటర్లు విఠల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎం.డి. మోయిజ్, మాజీ ఏఎంసీ చైర్మన్ పుష్ప రెడ్డి, కొండల్ రెడ్డి, రాచమల్ల శేఖర్ గౌడ్, క్రిస్టియన్ మైనారిటీ నాయకులు మేకల మైకేల్, అబ్దుల్ బాకీ, రాజశేఖర్ రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్‌పుత్, ప్రవీణ్, సుంకన్న, అశోక్ ముదిరాజ్, గోవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్‌కు పక్కా ఏర్పాట్లు!

మొదటి పేజీ తరువాయి...

ఇనుమడింపజేసేలా గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో పండుగ చేసుకోండి

మరోవైపు దీపావళి వేళ ఇందిరమ్మ ఇంట్లో లబ్ధిదారులతో పండుగ జరుపుకుంటానని, లబ్ధిదారుల సొంతింటి సంతోషంలో పాలుపంచుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో పండుగ చేసుకోవాలని ఆదేశించారు.

చర్చకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి...

పట్టుకుని తిరిగితే సరిపోదని, ప్రవర్తన కూడా రాజ్యాంగబద్ధంగా ఉండాలని రాహుల్ గాంధీకి హితవు పలికారు. పార్లమెంట్‌లో చర్చలకు సహకరించకుండా వాకౌట్లు చేయడం, ఆందోళనలకు దిగడం కాంగ్రెస్ సంస్కృతిగా మారిందని విమర్శించారు. మృతుల పేర్లతో పాటు మూడు కోట్ల మంది బంగ్లాదేశ్ చొరబాటుదారులు, రోహింగ్యాల బోగస్ ఓట్లను ఎన్నికల సంఘం తొలగిస్తుంటే రాహుల్ గాంధీకి ఎందుకు అభ్యంతరమని ప్రశ్నించారు. చొరబాటుదారులే కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుగా ఉన్నారని, అందుకే ఓటర్ల జాబితా ప్రక్షాళనను అడ్డుకునేందుకు 'ఓట్ల చోరీ' అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. దేశ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని, చొరబాటుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తప్పనిసరిగా తొలగించాలని అమిత్ షా పేర్కొన్నారు.

పార్లమెంట్‌లో చర్చకు బదులు ఆందోళనలా?

ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ చర్చలకు అత్యున్నత వేదిక అని అమిత్ షా అన్నారు. అలాంటి వేదికలో కీలక అంశాలపై చర్చించకుండా కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. పార్లమెంట్‌ను పనిచేయనివ్వకుండా బయట వీధుల్లో ఆందోళనలు చేస్తూ అరాచకాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. 80 ఏళ్ల ప్రజాస్వామ్యం తమ మోసాలకు లొంగిపోతుందని కాంగ్రెస్ భావిస్తోందా అని ప్రశ్నించారు. పార్లమెంట్, శాసనసభలు, గ్రామాలు, పొలాల్లోనూ బీజేపీ కాంగ్రెస్‌కు తగిన సమాధానం ఇస్తుందని వ్యాఖ్యానించారు. ప్రజలను సమీకరించి ఆందోళనలు చేయాలని కాంగ్రెస్ భావిస్తే, ఎదుర్కొనేందుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' యాత్ర రాహుల్ గాంధీకి బలమైన సమాధానమని పేర్కొన్నారు.

'ఆర్ఆర్ ట్యాక్స్' నిజమే అయితే చర్యలేవి?

మొదటి పేజీ తరువాయి...

అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోదీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. అలాంటప్పుడు ఆ వసూళ్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు తరచూ వస్తున్న మోదీ, అమిత్ షాలు ఈ అంశంపై బహిరంగంగా విమర్శలు చేయడం తప్ప, తదుపరి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు.

ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అంతర్గత అవగాహన ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్యలకు ముందుకు రావడం లేదని విమర్శించారు. ఆరోపణలు చేయడం, రాజకీయంగా విమర్శలు గుప్పించడం తప్ప ఆ వసూళ్లపై విచారణ జరిపించేందుకు బీజేపీ నేతలు చొరవ చూపడం లేదని అన్నారు.

'ఆర్ఆర్ ట్యాక్స్' అంశంపై ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ ఆరోపణలను తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఖండించింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఈ అంశం రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది.

శంషాబాద్ రూరల్ (షాపూర్) విద్యుత్ సెక్షన్ ఏఈగా బి సంతోష్ బాబు



షాపూర్ ఏ ఈగా బాధ్యతలు స్వీకరించిన బి సంతోష్ బాబు



సంతోష్ బాబు ను సన్మానిస్తున్న ఉద్యోగులు



సంతోష్ బాబు ను సన్మానిస్తున్న ఉద్యోగులు

శంషాబాద్, నవంబర్ 5(ప్రభాత ఉదయం) :

శంషాబాద్ విద్యుత్ రూరల్ (షాపూర్) సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ గా బి సంతోష్ బాబు పదవి బాధ్యతలు స్వీకరించారు. గురువారం షాపూర్ విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో పూర్వపు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్, పదోన్నతి పొందిన అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎం సురేష్ రెడ్డి నుండి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన అసిస్టెంట్ ఇంజనీర్ బి సంతోష్ బాబు మాట్లాడుతూ... సెక్షన్ పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారుల సమస్యలను ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారుల సమన్వయంతో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సంతోష్ బాబు అసిస్టెంట్ ఇంజనీర్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సిబ్బంది, కాంట్రాక్టర్ వాసుదేవరెడ్డి సన్మానించారు.

సాక్షి దినపత్రిక రాజేంద్రనగర్ జోన్ ఇంచార్జి బుడిగెల బాబు రావు-రంజిత దంపతుల

23వ వివాహ వార్షికోత్సవ వేడుకలు

బుద్వేల్, నవంబరు 5 (ప్రభాత ఉదయం)

సాక్షి దినపత్రిక రాజేంద్రనగర్ జోన్ ఇంచార్జి బుడిగెల బాబు రావు – రంజిత దంపతుల 23వ వివాహ వార్షికోత్సవ వేడుకలు గురువారం కిస్మత్ పూర్ లోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఆత్మీయ పాత్రికేయ మిత్రులు మేకల దామోదర్ రెడ్డి, అప్పారెడ్డి గూడెం భీమయ్య, మాధవి, మెక్కొండ ప్రేమ్ రాజ్, కోరని మహేష్ లు బాబు రావు దంపతులను సన్మానించి శుభాకాంక్షలు తెలియ చేశారు. బుడిగెల బాబు రావు దంపతులను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సహచర పాత్రికేయులు ఫోన్ లో వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు.



సాక్షి దినపత్రిక రాజేంద్రనగర్ జోన్ ఇంచార్జి బుడిగెల బాబు రావు, రంజిత దంపతులను సన్మానిస్తున్న సీనియర్ పాత్రికేయులు



బాబురావు – రంజిత దంపతులు

అల్మాస్ గూడలో క్రైస్తవ మహిళలపై జరిగిన దాడిపై ముఖ్యమంత్రి స్పందించాలి : పాస్టర్ స్వర్ణ రాజారాం

బుద్వేల్, నవంబరు 5 (ప్రభాత ఉదయం):

క్రైస్తవ మహిళల పై అల్మాస్గూడ లో జరిగిన దాడి, ఆ తర్వాత న్యాయం చేయాలని బుధవారం మీర్పేట్ చేరుకున్న క్రైస్తవ సంఘాల నాయకులపై కొందరు అల్లరి మూకల దాడి, పోలీస్ లాఠీ చార్జి ని తీవ్రంగా ఖండిస్తున్నామని, రాజేంద్రనగర్ మండల పాస్టరమ్మ ల ఫెలోషిప్ అధ్యక్షులురాలు పాస్టర్ పి అనురాధ స్వర్ణకుమార్, ప్రధాన కార్యదర్శి పాస్టర్ నెలకంటి స్వర్ణ రాజారాం, పాస్టర్ లీనా కుమారి దేవదాస్, పాస్టర్ ప్రవీణ కుమారి యేసురత్నం లు ఓ ప్రకటన లో తెలిపారు. ఇలాంటి సంఘటన లు పునరావృతం కాకుండ రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారులకు ప్రత్యేక ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఇద్దరు మహిళలను ఓ పురుషుడు విచక్షణారహితంగా చితకబాదిన తీరు చూస్తుంటే చాలా బాధవేసిందన్నారు. ఆ ఇద్దరు మహిళలు వారికి తెలిసిన వారి ఇండ్లకు వెళ్లడమే వారు చేసిన నేరమా అని ప్రశ్నించారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరికి మత స్వేచ్ఛ, ప్రకటించుకునే స్వేచ్ఛ ఉంటుందని గుర్తు చేశారు. ఇలాంటి సంఘటన లను ప్రభుత్వాలు అణచివేయకుంటే ప్రభుత్వంలో ఉన్న వారికే చెడ్డపేరు వస్తుందన్నారు. ఇప్పటికైన ముఖ్యమంత్రి ఈ సంఘటన పై విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించి, ఇలాంటి సంఘటన లు పునరావృతం కాకుండ చూడాలని కోరారు.

కాంగ్రెస్‌లో సద్దుమణగని విభేదాలు!

మొదటి పేజీ తరువాయి...

భావించారు. మొదట పీసీసీతో భేటీకి ఓకే చెప్పిన మంత్రి దామోదర తీరా సమయమైన తర్వాత తాను రావడం లేదంటూ సమాచారం ఇచ్చారు. దీంతో అప్పటికే గాంధీ భవన్‌కు వచ్చిన మహేశ్ గౌడ్.. సమావేశానికి మంత్రి దామోదర డుమ్మా కొట్టడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎమ్మెల్యేను కూడా కలవకుండానే వెనుతిరిగారు.

అసలేం జరిగిందంటే..

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ఇండియా కూటమి ఈ నెల 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ధర్నాకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ క్రమంలో ఢిల్లీలోని షాంగ్రిలా హోటల్ లాబీలో సంగారెడ్డి డీసీసీ నిమాయమకంపై మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. అయితే మంత్రి తనపై వ్యక్తిగత దూషణలకు దిగారని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారని ఆరోపించారు. ఎమ్మెల్యేపై గట్టిగా అరుస్తూ దుర్భాషలాడారని ప్రచారం జరిగింది. ఇదే విషయమై ఇరువురు నేతలతో పీసీసీ చీఫ్ భేటీ అవ్వాలని నిర్ణయించారు. సమస్యకు పరిష్కారం చూపాలని భావించారు. అయితే సమావేశానికి మంత్రి హాజరు కాకపోవడంతో ఆయన నిరాశగా గాంధీభవన్ నుంచి వెనుతిరాగాల్సి వచ్చింది.



ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమాన్ని

విజయవంతం చేసిన కాంగ్రెస్ శ్రేణులకు అభినందనలు

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం

కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగడం గర్వకారణం


టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి, నవంబర్ 5 (ప్రభాత ఉదయం)

ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన ఓటులి బచావో -- దేశ్ బచావో' కార్యక్రమాన్ని విజయవంతం చేసి తిరిగి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులను అభినందిస్తూ గురువారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమదుర్గ భవన్‌లో సంబరాలు నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి విజయోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ...ఢిల్లీలో నిర్వహించిన 'ఓటు బచావో -- దేశ్ బచావో' కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో బస్సుల ద్వారా తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగడం గర్వకారణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పట్టభద్రులారా ఓటరుగా నమోదు చేసుకోండి





గగన్ పహాడ్ లో ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోవాలని దరఖాస్తు ఫారాలను పంపిణీ చేస్తున్న బి ఆర్ ఎస్ నాయకులు శీలం తిరుపతి రెడ్డి

శీలం తిరుపతి రెడ్డి

బుద్వేల్, నవంబరు 5 (ప్రభాత ఉదయం)

అర్హులైన ప్రతి ఒక్కరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు గా తమ పేరును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియ లో బాగస్వాములు కావాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శీలం తిరుపతి రెడ్డి అన్నారు. గురువారం గగన పహాడ్ బస్తీలో డిగ్రీ పాసైన వారి వివరాలు సేకరించి వారికి ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఓటరు కార్డు, డిగ్రీ ఉత్తీర్ణత అయిన సర్టిపికెట్, ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజు ఫోటో, సెల్నెంబరు ఉంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు ఎర్రోళ్ల యాదయ్య, విజయ్, సతీశ్ యాదవ్, ఎ రవి, రాజురెడ్డి, హనుమంత్, సాయి కుమార్ లు పాల్గొన్నారు.



మహిళల నుద్దేశించి మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎ ఎస్ ఐ మహా లక్ష్మీ

బాల్య వివాహాలు, చిన్నారులపై హింస జరుగకుండ చూడాలి

రాజేంద్రనగర్ ఎఎస్ఐ మహా లక్ష్మీ

బుద్వేల్, నవంబరు 5 (ప్రభాత ఉదయం)

బాల్య వివాహాలు జరుగకుండ ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండటం మంచిదని రాజేంద్రనగర్ ఎఎస్ఐ మహా లక్ష్మీ అన్నారు. బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీ లో గల అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ మమత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ మమత మాట్లాడుతూ, పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లి చేయడం వల్ల వారి చదువు, ఆరోగ్యం, భవిష్యత్తు పూర్తిగా నాశనం అవుతుందన్నారు. ఆడపిల్లకు 18 సంవత్సరాలు, మగపిల్లాడికి 21 సంవత్సరాలు నిండకు డ పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అందుకు సహకరించిన వారిపై కూడా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిల్లలను చదివించి వారి కాళ్లపై వారు నిలబడేలా చేయడమే తల్లిదండ్రుల నిజమైన బాధ్యత అన్నారు. ఎక్కడైన బాల్య వివాహం జరుగుతుందని తెలిస్తే ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి అడ్డుకోవాలన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు బండారి బాలక్రిష్ణ మాట్లాడుతూ, పిల్లలను చదివిద్దాం.. బాల్య వివాహాలను అపుదాం. ఆడపిల్లలను కాపాడుకుం దాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ ఉమారాణి, సరస్వతి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణా రెడ్డి, లావణ్య, సరితారెడ్డి, అంగన్వాడీ టీచర్లు వసంత, సురేఖ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేస్తున్న న్యాయవాది ఎన్ వెంకటేష్

ప్రభుత్వ కళాశాల విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి: ఎన్ వెంకటేష్

బుద్వేల్, నవంబరు 5 (ప్రభాత ఉదయం)

రామయ్య హస్పిటల్స్ నిర్వాహకులు డాక్టర్ సుల్తాన్ అమరేందర్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎన్ వెంకటేశ్, రామయ్య హస్పిటల్స్ మేనేజర్ బెంజిమెన్, ప్రొఫెసర్ రాకేశ్ లు పాల్గొన్నారు. న్యాయవాది ఎన్ వెంకటేశ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పిల్లలకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను రామయ్య హస్పిటల్స్ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు తెలివి తేటలు ఎక్కువగా ఉంటాయని, వాటిని సక్రమమైన మార్గంలో పెడితే ఉన్నత శిఖరాలను అదిరోహించడం జరుగుతుందన్నారు.



మంజూరైన చోటే రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి!

ఆర్వోబిని 80 ఫీట్ల రోడ్డువైపు మళ్లించొద్దు.. పాత ప్రదేశంలోనే నిర్మించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 5 (ప్రభాత ఉదయం)

గద్వాల పట్టణంలోని పాత రైల్వే గేటు ప్రాంతంలో మంజూరైన రైల్వే ఓవర్ బ్రిడ్జిను 50 ఫీట్ల రోడ్డుకు బదులుగా 80 ఫీట్ల రోడ్డు వైపు మళ్లించే ప్రయత్నాలను విరమించుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ప్రతిపాదిత మార్పులతో భవిష్యత్తులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాత ప్రదేశంలోనే బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ గురువారం గద్వాల పట్టణం బసవన్న చౌరస్తా లో స్థానికులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...50 అడుగుల రోడ్డుగా మంజూరైన ఆర్.ఓ.బి (రోడ్డు ఓవర్ బ్రిడ్జ్) మార్గాన్ని 80 అడుగుల రోడ్డుగా మార్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఇళ్ల మధ్యలోంచి ఈ రోడ్డు వెళ్లడం వల్ల స్థానికులకు, కాలనీ ప్రజలకు మరియు స్థానిక పాఠశాలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. ఇళ్ల మధ్య ఆర్.ఓ.బి నిర్మాణం వల్ల వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం పెరగడంతో పాటు భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు 80 అడుగుల రోడ్డు విస్తరణ తమకు అభ్యంతరకరమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రషీద్, నాగరాజు, రిటైర్డ్ ఎంఈఓ స్వామి, అబ్దుల్ వహీద్, మహమ్మద్ నబీ, ఫయాజ్, ఫసియుద్దీన్, వెంకటేష్, రమేష్, హోటల్ రఫీ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి

ఆహ్వానం అందజేసిన ఎమ్మెల్యే జియంఆర్

దేవస్థాన అభివృద్ధికి మరో 100 కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే జియంఆర్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సీఎం



సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్



శ్రీ గురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ను సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేయించిన ఎమ్మెల్యే జిఎంఆర్, ఆలయ కమిటీ ప్రతినిధులు.

దేవరకద్ర, నవంబర్ 5 (ప్రభాత ఉదయం)

శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానిస్తూ దేవస్థానం పాలకమండలి చైర్మన్, ఈవో, అర్చకుల బృందం, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి , దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సెక్రటేరియట్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.అనంతరం కురుమూర్తి స్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కాటేజీలు, కళ్యాణ మండపం తదితర మౌలిక వసతుల కల్పనతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం మరో 100 కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ముఖ్యమంత్రి గారిని కోరారు.ఈ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి....రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కి, ఎమ్మెల్యే జియంఆర్ కి ఆదేశాలిస్తూ...సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, దేవస్థాన అభివృద్ధికి అవసరమైన కార్యాచరణ రూపొందించి, నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ ప్రతిపాదనలు ఎంతగానో ఉపయోగపడతాయి.అదేవిధంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, మండలాల్లో ఇంకా మిగిలిపోయిన రోడ్ల నిర్మాణ పనుల కోసం 99 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు మిషన్ భగీరథ పథకం కింద వివిధ గ్రామాలకు పైప్‌లైన్ల నిర్మాణం, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణాల కోసం 17 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు. అభివృద్ధి ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి, గ్రామీణ తాగునీటి మౌలిక వసతుల కల్పనతో పాటు కురుమూర్తి స్వామి దేవస్థాన అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలియజేశారు.

కరువు మండలంలో పంట నష్టాల క్షేత్రస్థాయి పరిశీలన

ఎండిన పంటలపై వ్యవసాయ అధికారుల సర్వే.. ప్రత్యేక యాప్‌లో నమోదు



జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 5(ప్రభాత ఉదయం):

కేటిదొడ్డి మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాల అంచనా కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రైతుల పొలాలను సందర్శిస్తూ ఎండిపోయిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్ట వివరాలను సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నందిన్నె గ్రామ శివారులో వ్యవసాయ అధికారిణి ప్రవళిక, గ్రామ సర్పంచ్ బోయ నాగమ్మతో కలిసి ఎండిపోయిన పంటలను పరిశీలించారు. పంటల పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి నష్ట వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు.

చదువుతోపాటు కళా రంగాల్లోనూ రాణించడం ప్రశంసనీయం

జిల్లా పేరు ప్రఖ్యాతులు నిలిపేలా కృషి చేయాలి. ... జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.

ఢిల్లీలో ప్రదర్శనలిచ్చిన బాల భవన్ విద్యార్థులకు కలెక్టర్ అభినందన

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 5(ప్రభాత ఉదయం):



విద్యార్థులు చదువుతోపాటు సంగీత, నృత్య, చిత్రలేఖన తదితర కళా రంగాల్లోనూ రాణించడం ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గద్వాల బాల భవన్ విద్యార్థులు అనన్య, సుస్వర ప్రియ, సాహితీప్రియ, పూజ్యశ్రీత అక్టోబర్ 30వ తేదీ నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మూడు రోజులపాటు నేషనల్ బాల భవన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన జాతీయ బాలల సదస్సు, ఏకీకరణ శిబిరంలో పాల్గొని తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, ఎస్కార్ట్ గా వెళ్ళిన వాయిద్య శిక్షకులు బోడ శంకర్ ను గురువారం ఐడిఓసిలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీలో విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనల గురించి, అక్కడ ఇతర రాష్ట్రాల విద్యార్థులతో వారి అనుభవాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మన దేశంలో విభిన్న భాషలు మాట్లాడే, సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన ప్రజలు జీవిస్తున్నప్పటికీ మనమంతా భారతీయులమే కాబట్టి కలిసి మెలిసి జీవిస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఏకీకరణ శిబిరం ముఖ్య ఉద్దేశం కూడా భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబించడమేనని పేర్కొన్నారు. అక్కడికి వివిధ రాష్ట్రాల నుంచి భిన్న కళా రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులు రావడంతో అందరిలో స్నేహ సంబంధాలు పెంపొందించబడతాయని చెప్పారు.

కళా రంగాల్లో సాధనతో క్రమశిక్షణ.

మన భారతీయ సనాతన, సంప్రదాయ నృత్యాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని, ఎంతో మంది విదేశీయులు సైతం భరతనాట్యం, కూచిపూడి, కథాకళి, ఒడిస్సి వంటి నృత్య రీతుల్లో శిక్షణ పొందుతుండటమే ఇందుకు నిదర్శనమని కలెక్టర్ పేర్కొన్నారు. వివిధ కళల్లో రాణించడం వలన క్రమశిక్షణ అలవడుతుందని, ఆదర్శనీయమైన జీవన విధానానికి కళలు మార్గదర్శనం చూపుతాయనడంలో అతిశయోక్తి లేదన్నారు. కళాకారులు తమ ప్రదర్శనలతో మానసిక ఆనందాన్ని పొందుతారని, ప్రేక్షకులు సైతం సంతోషించడానికి విభిన్న కళలు దోహదపడతాయన్నారు. ఎంతోమంది కళాకారులు అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చాటి అవార్డులు, రివార్డులు పొందడం జరిగిందన్నారు. ఆయా కళలను చాలా మంది వృత్తిగా చేపట్టి ఔత్సాహిక విద్యార్థులకు శిక్షణను కూడా ఇస్తుండడం గర్వకారణమన్నారు. 40 ఏళ్ల కిందట గద్వాలలో ఏర్పాటు చేసిన బాల భవన్ వేలాది మంది కళాకారులను తీర్చిదిద్దిన ఘనతను పొందిందన్నారు. విద్యార్థులు భవిష్యత్తులోనూ బాలభావన్ ను సద్వినియోగం చేసుకుంటూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రదర్శనలతో జోగులాంబ గద్వాల జిల్లాకు పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.



విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 5(ప్రభాత ఉదయం):

వార్షిక ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం. హృదయరాజు సూచించారు. గురువారం గద్వాల ప్రభుత్వ జూనియర్ కళాశాల(కో-ఎడ్యుకేషన్)ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక అధ్యయన తరగతులను పరిశీలించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి వారి విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సొంతంగా టైమ్‌టేబుల్ రూపొందించుకుని క్రమశిక్షణతో చదవాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక పునశ్చరణ తరగతులు నిర్వహించాలని అధ్యాపకులను ఆదేశించారు. ప్రతిరోజూ విద్యార్థులకు ఇంటిపని కేటాయించి, మరుసటి రోజు వాటిని తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీరన్నతో పాటు అధ్యాపకులు పవన్ కుమార్, కలీముల్లా, శేఖర్, సుతారి గోపి, బాలకృష్ణ, రవిశంకర్, మల్లికార్జున్, గీత, వెంకటేష్, వీరేష్, వీరేశం, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలి

జాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

ధరూర్, నవంబర్ 5 (ప్రభాత ఉదయం)

విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా తల్లిందండ్రులు కృషి చేయలని హెచ్ఎం రేవతి అన్నారు. ధరూర్ మండలంలోని జాంపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడేలా ప్రోత్సహించాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతతో, శుభ్రంగా ఉండాలని తల్లిదండ్రులు సూచించారు. సమావేశంలో హెచ్ఎం రేవతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కళాశాల విద్యార్థికి రోడ్డు ప్రమాదం.. తీవ్ర గాయాలు

ద్విచక్ర వాహనం ఢీకొని విద్యార్థికి గాయాలు..

ఇంటర్నల్ బ్లీడింగ్‌తో ఆసుపత్రిలో చికిత్స

పాపన్నపేట,నవంబర్ 5(ప్రభాత ఉదయం)

కళాశాలకు వెళ్లిన విద్యార్థి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం మండల కేంద్రమైన పాపన్నపేటలో చోటుచేసుకుంది. మల్లంపేట రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్ అనే ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి.వివరాల్లోకి వెళితే.. నార్సింగి గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ పాపన్నపేట ప్రభుత్వ కళాశాల లో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.కళాశాల సమయంలో మూత్రవిసర్జన నిమిత్తం మల్లంపేట రహదారి వైపు వెళ్లిన దుర్గాప్రసాద్ తిరిగి వస్తుండగా ఎక్సెల్ ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో విద్యార్థి తీవ్రంగా గాయపడటంతో వెంటనే కళాశాల అధ్యాపకులు అతడిని పాపన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.వైద్య పరీక్షల్లో విద్యార్థికి అంతర్గత రక్తస్రావం (ఇంటర్నల్ బ్లీడింగ్) అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.ఈ ఘటనతో విద్యార్థి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కళాశాల సమయాల్లో విద్యార్థుల భద్రతకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థుల కదలికలపై పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలి

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 5(ప్రభాత ఉదయం):

ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు వరికి బదులుగా పప్పు దినుసులు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని రైతు విజ్ఞాన కేంద్రం జిల్లా సమన్వయకర్త అర్చన అన్నారు.గురువారం యర్రవల్లి మండలంలోని తిమ్మాపూర్, బీచుపల్లి, యర్రవల్లి గ్రామాలలో ఆమె క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాభావ పరిస్థితులు, పంటల కీలక దశల్లో నేలలో తేమ అందుబాటులో లేకపోవడం వలన పంటలు ఎండిపోవడం మరియు రైతులు ఎదుర్కొంటున్న పంట నష్టాల గురించి రైతులతో చర్చించారు. రైతుల నుంచి ప్రస్తుత సాగు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీక్యాల రైతు ఉత్పత్తిదారుల సంఘం రైతులు, మహిళా రైతులతో సమావేశమై, ఎఫ్ పి ఓలో సభ్యత్వం పొందడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా సామూహిక మార్కెటింగ్, నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాల లభ్యత, సాంకేతిక సలహాలు మరియు మెరుగైన మార్కెట్ అవకాశాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేరుశనగ పొలంలో నిర్వహించిన రైతు క్షేత్ర పాఠశాల కార్యక్రమంలో కూడా పాల్గొని రైతులతో పంట సాగు విధానాలు, యాజమాన్య పద్ధతులు, పంట అభివృద్ధి దశలపై చర్చించారు. ఎఫ్ పి ఓ రైతుల వేరుశనగ మరియు వరి పొలాలను సందర్శించారు. వేరుశనగ పంటలో పూత దశలో ఎకరానికి 200 కిలోల జిప్సం మరియు 10 కిలోల యూరియా వేయాలని సూచించారు. వరి పొలాలను పరిశీలించగా నేలలో తేమ కొరవడటంతో పంట పూర్తిగా ఎండిపోయినట్లు గుర్తించారు. సందర్శించిన ప్రాంతంలో సుమారు 635 ఎకరాల్లో వరి పంట పూర్తిగా ఎండిపోయినట్లు రైతులు అధికారులకు వివరించారు. ఈ పర్యటనలో మండల వ్యవసాయ అధికారి సురేష్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608